


## మే ౨౦౦౯

కథా సాగర మథనంలో విశ్లేషణను 'మే'నెల మాస పత్రికలు స్వాతి, ఆంధ్రభూమి, విపుల, రచనలు; వార పత్రికలు స్వాతి, ఆంధ్రభూమి, నవ్య; దినపత్రికలు ఈనాడు, వార్త, ఆంధ్రజ్యోతి, సాక్షి, ఆంధ్రప్రభల ఆదివారం అనుబంధాలలో ప్రచురితమైన 95 కథలను పరిశీలించడం జరిగింది.

'కథాసాగర మథనం'లో పాఠకుల పరిచయానికి కథలను ఎంచుకోవటంలో సాధారణంగా రచయితలు స్పృశించని కథాంశాలను ప్రదర్శించే కథలకు పెద్ద పీట వేయటం జరుగుతుంది. ఎందుకంటే, మన పత్రికలలో కథలు అనేకం 'మూస' కథాంశాలనే ప్రదర్శిస్తాయి. ఇలాంటి కథలలో రచయితలు అత్యద్భుతమైన కథా కథన విన్యాసాల్ని ప్రదర్శిస్తే కానీ, అలాంటి కథలు మెప్పించలేం. అపోహలు తొలిగి భార్య భర్తలొకటి కావటం, తమ తప్పును తెలుసుకుని ముసలివాళ్ళను చేరదీయటం, మగవాడి దౌష్ట్యం, అణిచివేతలు ప్రదర్శించే కథలు మన పత్రికలలో అధికంగా కనిపిస్తాయి. ఒక సినిమా హిట్ అయితే, అలాంటి పది సినిమాలు తయారయ్యేట్టే, ఒక కథ ప్రచురితమైతే అలాంటివే మరో పది కథలు తయారవుతాయి. ఎందుకంటే, ఇలాంటి కథలకే ఆమోద ముద్ర లభిస్తుందన్న అభిప్రాయం ఏర్పడుతుంది. అలాంటివే కథలు వస్తూండడంతో, ఉన్నవాటిల్లోంచే బాగున్నవి ఎంచుకుని వేయాల్సి వస్తుంది పత్రికలకు. దాంతో, కథలలో ప్రదర్శించే ఆలోచనల్లో, జీవితాల్లో ఒక రకమైన 'రొటీన్' ఏర్పడిపోతుంది. సినిమాల్లాగే, కథలూ 'నవ్యత' లేక 'మూస' అయిపోతాయి. అందుకే సినిమాలలో 'అవార్డు' సినిమాలలాగే, కథలలో ఇలాగే రాస్తే అవార్డులొస్తాయని 'అవార్డు' కథలూ, 'అవార్డుకథకులూ' ఏర్పడ్డారు.

ఈనెల కూడా మామూలు కథలు, రొటీన్ కథలు, అలవాటయిన కథల నడుమ కాస్తయినా భిన్నంగా ఉన్న కథలు, వైవిధ్యం ప్రదర్శించిన కథలను ఎంచుకోవటం కోసం కొంచెం కష్టపడాల్సి వచ్చింది. అలా ఎంచుకున్న కథలివి.

***<u>కడలి కెరటం</u>***

'ఎస్వీ కృష్ణ' రచించిన ఈ కథ 'స్వాతి' మాసపత్రికలో ప్రచురితమయింది. ఈ కథను పాఠకులకు పరిచయం చేయటం ఎందుకంటే, నిజానికి కాస్త కల్పన జోడించి కథగా రాసినా, అది లాజిక్‌కి నిలవకపోతే, కథనంలో బలం లేకపోతే, రచయిత చెప్పాలనుకున్న నిజం బలహీనమైపోతుంది. దాంతో రచయిత అనుకున్నది నెరవేరటం అటుంచి అందుకు వ్యతిరేకమైన ఫలితం లభిస్తుంది. ఈ మధ్య ఈ రచయిత రాస్తున్న సీరియల్ తనదేనని, ఓ రచయిత్రి కోర్టులో కేసువేసి తన 'కాపీరైటు' నిలుపుకుని, రచయిత 'కాపీరైటు'ను తోసిపుచ్చింది. ఈ కథలో 'అమర్' అనే రచయిత జైలుకెళతాడు. అతడు ఓ ప్రఖ్యాత రచయిత్రికి ఘోస్ట్ రైటరు. అతను రాసిన వాటిని, తన పేరుతో ఆమె అచ్చువేసుకుని పేరు కొట్టేస్తుంటుంది. రాసినందుకు ఇతడికి డబ్బులిస్తుంటుంది. తన పేరు అచ్చులో చూసుకోవాలన్న తపనలో 'అమర్' ఓ నవలరాసి ఓ పత్రికకు పంపుతాడు. బహుమతి వస్తుంది. సీరియల్ ఆరంభమయ్యే సమయానికి, ఆ రచయిత్రి ఆ నవల తనదేనని కోర్టులో కేసు వేస్తుంది... 'అదే సమయంలో నేను సిటీలో లేని సందర్భంలో 'ఆమె'

తను ప్రచురించుకున్న ఒక పుస్తకాన్ని సభ ఏర్పాటు చేసి అందులో ఆవిష్కరణ సభ కూడా జరిపానని చెపుతూ... ఆ పుస్తకాన్నీ, ఆ సభకి అతిథులుగా వచ్చి ఆ నవల గురించి వేదికపై మాట్లాడిన పేరున్న, సీనియర్ రచయితల ఫోటోలను సాక్ష్యాలుగా చూపిస్తూ... తన నవలను నేను కాపీ చేసి ఆ పత్రికలో పోటీకి పంపించానని, వాళ్ళు నాకు బహుమతినిచ్చి, నా పేరుతో సీరియల్‌గా వేస్తున్నారనీ, వెంటనే ఆ సీరియల్‌ని ఆపి, తనకు న్యాయం చేయాలనీ సివిల్ కోర్టులో కేసు వేసిందామె' అంటాడు 'అమర్'. ఆమె కేసు గెలుస్తుంది. అమర్ జైలుకి వెళతాడు. అతడికి బెయిలు వస్తుంది. కానీ ఉద్యోగం పోతుంది. ఇదీ కథ. కథ చివర్లో తన కథకూడా తన కూతురేనని అంటాడు రచయిత. ఆ రచయిత్రి 'కేసు' గురించి, కథలో మరొకరు తన నవల కాపీ కొట్టారని 'సభ' చేసి బుజువులు చూపినంత మాత్రాన ఏ కోర్టూ ఒప్పుకోదు. రెండు రచనలూ ఒకే రకంగా ఉండటాన్ని మించి కాపీకి మరో నిదర్శనం అనవసరం.

ఇక్కడ కథలో రచయిత 'రెండూ' ఒకే రకంగా ఉన్నాయన్న విషయం ప్రస్తావించలేదు. కోర్టు 'అమర్'ను జైలుకు పంపింది కాబట్టి రెండూ ఒకే రకంగా ఉన్నాయనుకోవాల్సి వస్తుంది. ఒకేరకంగా ఎలా ఉన్నాయన్న ప్రశ్న వెంటనే వస్తుంది. ఎందుకంటే, 'అమర్' నవలను తనే రాసి పోటీకి పంపడు. ఇంకా సీరియల్ ఆరంభం కాకముందే, ఆ రచయిత్రి కోర్టులో కేసు వేసింది. సీరియల్ అచ్చుకాకముందే, ఆమె దగ్గరకు మొత్తం నవల ప్రతి ఎలా వచ్చింది? ఆమె స్వయంగా రాయలేదని 'అమర్' ముందే చెప్పాడు. 'అమర్' నవలను ఆమె ఎలా ఊహించి, అంత త్వరగా రాయించి అచ్చువేసుకోగలిగింది, అదీ సీరియల్ ఇంకా ఆరంభం కాకముందే? ఈ ప్రశ్నకు కథలో సమాధానం లేదు. ఇది కథను బలహీనం చేస్తుంది. కనీసం, పత్రికలో ఎవరికో డబ్బులిచ్చి, ఆ రచయిత్రి నవల ప్రతిని సంపాదించి, అచ్చువేసుకున్నట్టు చూపిస్తే 'లాజిక్' నిలిచేది. అలాకాకపోతే, ఈ నవల అంతకు ముందు 'అమర్' రచయిత్రికి ఇస్తే, ఆమెకు నచ్చలేదని, దాంతో, ఆ నవలను తాను తన పేరుతో పత్రికకు పంపాననీ, దానికి బహుమతి రావటంతో, తనదగ్గర ఉన్న ప్రతిని అచ్చువేసి, అది తనదేననే వీలు రచయిత్రికి చిక్కినట్టు చూపినా, కథ నిలిచేది. అమర్ పట్ల సానుభూతి కలిగేది. కానీ అవేవీ చూపకుండా, అలాంటి నవలని, సీరియల్ రాకముందే రచయిత్రి ఎలా అచ్చువేసి, కోర్టును నమ్మించిందో చెప్పకపోవటం వల్ల కథ బలహీనమయిపోయింది. ఎన్ని పుస్తకావిష్కరణ ఫోటోలు చూపినా, ఎంతమంది సీనియర్ రచయితలు పొగడినా రెండు నవలలు ఒకే రకంగా ఉంటేనే 'కాపీ' అని ఎవరైనా నమ్ముతారు. దాంతో ఈ కథ రచయిత తనను తాను సమర్థించుకోవటం, రచయిత్రిని చులకన చేయటం కోసం రచించాడనిపిస్తుంది.

గమనిస్తే, అనేక సందర్భాలలో ఒకే రకమైన 'కథాంశం' కల కథలు, కథకుల జీవితానుభవాల ఆధారంగా సృజించినవి కావటమే. అయితే, కథాంశాలలో 'సామ్యం' ఉన్నా, రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు, రచనా సంవిధానం ఆయా రచనలను ప్రత్యేకంగా నిలుపుతాయి. 'కాపీ' అనే అవకాశాన్నివ్వవు. మదామ్ బోవరీ, అన్నా కరెనీనా, డాక్టర్ జివాగో, లేడీ చాటర్లీస్ లవర్, పెయింటెడ్ వెయిల్ వంటి 'క్లాసిక్' నవలల్లో ప్రధాన అంశం వైవాహికేతర సంబంధమే. కానీ ఈ అంశాన్ని ఆయా రచయితలు తమతమ స్వీయానుభవాల సృజనాత్మక సంద్రంలో స్నానింపచేసి సృజించిన తీరు ఆయా రచనలకు ప్రత్యేకతనాపాదిస్తుంది. 'కాపీ' అభియోగాలు తరచుగా వస్తున్న నేపథ్యంలో, రచయితలు, తమ కథల ద్వారా తమ దృక్పథాన్ని వివరించాలని ప్రయత్నించటం సహజం. తమ అనుభవాల ఆధారంగా రచించే కథలలో రచయితలు హీరోలు కావటమూ సహజమే. కానీ, తమ సమర్థనలో లాజిక్ లేకపోతే మాత్రం వ్యతిరేక ఫలితం ఉంటుందనేందుకే ఈ కథను ఇంత విపులంగా విశ్లేషించాల్సి వచ్చింది. ఈ విశ్లేషణ కథనూ, లాజిక్‌లకే పరిమితం. దీన్లో ఎలాటి వ్యక్తిగతాలూ లేవని గమనించాలి.

<u>ఫన్నీ డేస్</u>

భీమరాజు వెంకట రమణ రచించిన ఈ కథ, 31 మే ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమయింది. కథాంశం అలవాటయిందే మిత్రులు కూర్చుని తమ ప్రేమపురాణాలు చెప్పుకుంటుంటారు. భార్గవ్ అనే వ్యక్తి తన ప్రేమకథ చెపుతాడు. కాలేజీలో ఓ అమ్మాయిని

ప్రేమిస్తాడు. ఆమె, తనని ప్రేమిస్తున్నానని వెంటబడ్డ వారందరికీ ఓ పరీక్ష పెడుతుంటుంది. ఆ పరీక్షవల్ల ఆ వ్యక్తి బాగుపడుతుంటాడు. భార్గవ్‌ను కూడా ఆమె 'కాలేజీ ఫస్ట్' తెచ్చుకోమంటుంది. అతడు కాలేజీ ఫస్ట్ వచ్చి, వెళ్ళేసరికి ఆమె ఊరు వదిలి వెళ్ళిపోతుంది. కొసమెరుపేమిటంటే, ఆమెనే అతడి భార్య. కథ ఆసక్తికరంగా సాగుతుంది. ఆమె ఊరువెళ్ళిందని తెలిసేవరకూ బాగుంది. 'ఆమెనే తన భార్య' అని చెప్పటం కొసమెరుపుగా బాగున్నా, ఊరు వదిలి వెళ్ళిన వాళ్ళు ఎలా కలిశారు? ఆమె వచ్చి తన మాట నిలుపుకుందా? ఈయన వెతుక్కుంటూ వెళ్ళి తన ప్రేమను నిరూపించుకున్నాడా? రచయిత చెప్పలేదు. దాంతో కథ బాగుందనిపించి అసంతృప్తిని మిగులుస్తుంది.

*మోహ తిమిరం, పరిష్కారం*

'మోహ తిమిరం' కథ మే 15, వార్తలో ప్రచురితమయింది. రచించింది డాక్టర్ ధేనువకొండ శ్రీరామ మూర్తి. 'పరిష్కారం' కథ మే 31 ఈనాడులో ప్రచురితమయింది. రచించింది కర్లపాలెం హనుమంతరావు. ఈ రెండు కథలలో అపోహలతో సరిగ్గా దాంపత్యం చేయని భార్యాభర్తలు అపోహలు తొలిగి ఒకటవుతారు. 'మోహ తిమిరం' కథలో, మేనరికం చేసున్నందుకు, పిల్లలు అవలక్షణాలతో పుడతారన్న భయంతో, భార్యా భర్తలు దూరంగా ఉంటారు. 'పరిష్కారం' కథలో, తనకు 'ఎయిడ్స్' ఉందన్న అనుమానంతో భర్త భార్యను తాకడు. అపోహలు తొలగటంతో ఒకటవుతారు. పైకి ఈ రెండు కథలలో కేంద్ర బిందువు తేలికగా అనిపించవచ్చు. కానీ ఎదుటివారికి 'సిల్లీ'గా అనిపించే, అనేక అంశాలు వ్యక్తులకు ప్రాణాంతకంగా అనిపిస్తాయి. ఈ రెండు కథలలో 'సిల్లీ' కారణాలను 'బలం'గా నిరూపించే ప్రయత్నాలు చేసేకన్నా, దాంపత్య బంధం లేకపోవటం వల్ల కలిగే 'అసంతృప్తి'కే ప్రాధాన్యం ఇచ్చారు రచయితలు. 'మోహ తిమిరం' కథలో రచయిత అక్కడక్కడా ప్రదర్శించిన భావాలు ఆనందం కలిగిస్తాయి.

'ఆనందకరమైన అవకాశాలు ఏర్పరచుకోవడానికి జీవితంలో అనేక సందర్భాలు మనముందు ఉంటాయి, నిర్నిబంధమైన స్వేచ్ఛ ఈ అవకాశాలు తన మనస్సును ప్రవృత్తికి అనుకూలంగా మలచుకోవడం మనిషి ప్రవృత్తిపై ఆధారపడి ఉంటుంది' అంటాడు రచయిత వైవాహికేతర సంబంధాల గురించి రచయిత భావవ్యక్తీకరణ ఆనందం కలిగించినా, వైవాహికేతర సంబంధాలు 'ఆనందకరమైన అంశాలు' అవటంతో రచయిత, ఇలాంటి లైంగిక సంబంధాలను సమర్థిస్తున్నాడేమోనన్న సంశయం కలుగుతుంది. ఎందుకంటే, ఈ కథలో భర్త తిరునాళ్ళలో సుఖం వెతుక్కుంటే, భార్య ఓ యువకుడి సమాగం కోసం ఉవ్విళ్ళూరుతుంటుంది. కానీ ఈ కథలో భార్య 'మేనరికం పిల్లలకు' భయపడి భర్తను దూరం ఉంచుతుంది. కథ చివరలో భర్తకి హెచ్.ఐ.వి పాజిటివ్‌గా రిపోర్టు వస్తుంది. 'హె.చ్.ఐవి'తో సహా, 'అపోహ'లలో సామ్యం ఉన్నా, రచయితలు రచించిన రెండు కథలూ వేర్వేరు కథలుగా నిలుస్తాయి. అంతగా సంతృప్తినీయకున్నా ఈ అంశం చూపేందుకే ఈ కథలను పరిచయం చేయాల్సివచ్చింది.

*ఈస్తటిక్ స్పేస్*

దగ్గుమాటి పద్మాకర్ రచించిన ఈ కథ, మే 10 ఆంధ్రజ్యోతిలో ప్రచురితమయింది. ఈ రచయిత కథ చివర్లోనే తన పాత్రల మీద మాట పడనివ్వడని పరోక్షంగా ప్రకటించాడు. ఇందులో, భర్తపోయిన లలిత, భార్యపోయిన రవిబాబుకు నడుమ సాన్నిహిత్యం ఏర్పడుతుంది. రవిబాబు, లలితకు తన కోరిక వినిపిస్తాడు. 'నాలో యేం కోరుకుంటున్నావు నువ్వు? ఈ శరీరాన్నే కదా!' అని ఈసడిస్తుంది లలిత. 'రేపటి లోగా మళ్ళీ నా శరీరం గురించిన స్పృహ నీ కొచ్చిందంటే రానవసరం లేద'ని తరిమేస్తుంది. మరుసటి రోజు వాళ్ళిద్దరూ మళ్ళీ వాదించుకుంటారు. 'ఇంత సతీ సావిత్రి లెవెల్లో ఉంటావని నేను అనుకోలేదు మరి' అంటాడు రవిబాబు.

'కలయిక గురించి పట్టింపు ఉండకూడదని వాదించే వాళ్ళంతా ఎవరు పిలిస్తే వాళ్ళకి దాసోహం కావాలా?' అని ప్రశ్నిస్తుంది లలిత.

'నాలుగైదు సంవత్సరాల ఆత్మీయ పరిచయస్తుడు సెక్స్ దగ్గరకు వచ్చేసరికి పరాయివాడైపోతాడా?' అంటాడు రవిబాబు.

‘మన శరీరాలు, గతం కూడా వేర్వేరు వ్యక్తులతో ముడిపడి ఉన్నాయంటుంది‘ లలిత.

‘నువ్వు నీ భర్త స్మృతులతో, నేను భార్య జ్ఞాపకాలతో గడపాలంటావా?‘ అంటాడు రవిబాబు.

‘నువ్వు నన్ను మనసులో కోరుకోవడమనేది గతంలో, అంటే, మీ భార్య ఉండగా కూడా ఉందా?‘ అని ప్రశ్నించి, కాస్సేపటికి, అతడిని ముద్దుపెట్టుకుంటుంది. ఇద్దరూ శారీరకంగా కలుస్తారు. ఆ తరువాత లలిత ‘మనుషులకు సాంస్కృతిక విలువలు పిల్లల స్థాయి నుంచీ నేర్పాలి రవీ‘ అంటూ ‘కండోమ్‘ ప్రచారాన్ని విమర్శిస్తుంది. తమలో ఉన్న ‘ఈస్తటిక్ స్పేస్‘ని గుర్తించక పోవటం వల్ల, మగవాళ్ళు, పశువులై అత్యాచారాలు చేస్తున్నారని తీర్మానిస్తుంది చివరలో. అంతకుముందు రవిపాత్ర, తన ఇష్టాఇష్టాలను దాచుకుని సందర్భోచితంగా మొత్తాన్ని ఖర్చు చేసినట్టు, ‘పరాయి స్త్రీల మీద ఏర్పడే ఇష్టాలు, కోరికల్ని ‘ఈస్తటిక్ స్పేస్‘లో స్టోరయి, తన భార్యతో జరిగే సంగమంలో లీనమయ్యేవంటాడు. ఇదీ కథ.

ఈ కథను సంభాషణలతో సహా ఉదహరించటం ఎందుకంటే, అసలు కథను చదవకున్నా, పాఠకులు, ఈ కథలో రచయిత ప్రదర్శించిన సందిగ్ధం స్పష్టమవాలనే. ‘పాత్రల మీద మాట పడకూడద‘న్నాడు కాబట్టి, పాత్రల ఆలోచనల్ను పరామర్శిస్తే, పాత్రలు వాటిద్వారా రచయిత ఆలోచనల్లోని సందిగ్ధాలు గమనించవచ్చు.

శారీరక సంబంధం గురించి రచయిత వ్యక్తపరచిన భావాలు ఒకోసారి అభ్యుదయం వైపు మొగ్గి, మరోసారి ‘అయోమయం‘ వైపు మొగ్గుతాయి. ‘సావిత్రి లెవెల్‘ అని వాడడం వల్ల సాంప్రదాయక ఆలోచనలను, నియమనిబంధనలనూ కాదన్నట్టవుతుంది. ఆ వెంటనే, ‘శారీరక పట్టింపు లేనివారు ఎవరు పిలిస్తే వాళ్ళకు దాసోహం కావాలా?‘ అని ప్రశ్నించటం ‘భర్త స్మృతులతో నేనేదో తంటాలు పడుతున్నాన‘నటం, రచయిత దేన్ని సమర్థించాలో, దేన్ని సమర్థిస్తే ఏమౌవుతుందోనని, అన్ని ఆలోచనల నడుమ ‘బాలెన్స్‘ చేయాలని ప్రయత్నించాడని అనిపిస్తుంది. ‘లైంగిక సంబంధం‘ కేవలం‘కండరాల రాపిడి‘ అని నమ్మి, ప్రచారం చేసేవారినీ, అది వ్యక్తిత్వానికి, శీలానికీ సంబంధించినది అని నమ్మేవారినీ సంతృప్తి పరుస్తూ, ఆధునిక భావాలను ప్రదర్శించాలని తపన పడటం కనిపిస్తుంది. ఎందుకంటే ‘నా శరీరాన్ని గురించిన స్పృహ ఉండకూడదన్న‘ లలిత మళ్ళీ శారీరక స్మృతుల ప్రసక్తి తెచ్చి, ‘వశం‘ తప్పి లైంగిక చర్యలో పాల్గొంటుంది. ‘నువ్వు చూపిన ఆపేక్షకు నాలో ఏమీ మిగుల్చుకోకూడదనిపించిందా క్షణం‘ అని సమర్థించుకోచూస్తుంది. తరువాత కండోమ్ ప్రచారాలపై, రెచ్చగొట్టే ప్రకటనలపై విరుచుకుపడి, ‘సాంస్కృతిక విలువలు నేర్పాలి‘ అని తీర్మానించి, ‘ఈస్తటిక్ స్పేస్‘ అనే ‘మానసిక వ్యభిచారా‘న్ని సమర్థిస్తుంది. కానీ లలిత, రవిబాబుకు లొంగటం వల్ల రచయిత స్త్రీ వ్యక్తిత్వాన్ని, గౌరవాన్ని, తన శరీరం నచ్చిన వాడికే అర్పించుకునే హక్కునూ సమర్థించే బదులు ‘a female is at the mercy of her sex’ తో పాత సూత్రాన్ని నిరూపించినట్టయింది. ‘ఆడవాళ్ళ బలహీనత వారి శారీరక కోరిక‘ అనే మగవాడి వాదనను బలపరచినట్టయింది. పైగా ‘సాంస్కృతిక‘ విలువలంటూ సాంప్రదాయక నైతిక విలువలను ప్రతీక అయిన ‘సావిత్రి‘ని ఎద్దేవ చేయటం, చులకన చూపటం, , ప్రస్తుతం రచయితల సందిగ్ధాన్ని స్పష్టంగా ప్రదర్శిస్తుంది.

రచయితలు తమ రచనలలో నైతిక విలువలను ప్రదర్శించి, మానసిక నియంత్రణకు పెద్దపీట వేస్తే వారిని బూజుపట్టిన సాంప్రదాయవాదులుగా పరిగణించి పక్కకు నెట్టేస్తారు. అలాగని నైతిక విలువలను వదలమని చెప్పలేదు కానీ లైంగకి సంబంధాలను ప్రోత్సహించకపోతే రచయిత ఆధునిక, అభ్యుదయవాద ఆమోద ముద్రను పొందలేడు. దాంతో రెచ్చగొట్టే ప్రచారాన్ని, కండోమ్ ప్రకటనలను విమర్శించి, ‘వేరు శరీరం కాద‘ని స్త్రీతో అనిపించి, ఆ శారీరక కోరికకు ఆమె లొంగేట్టు చేసి, ‘అయినా తప్పేంలేదు‘ అని వాదించేట్టు చేస్తున్నారు రచయితలు. స్పష్టమైన ఆలోచన, ప్రదర్శించదలచుకున్న అంశంపై నిర్దుష్టమైన అవగాహన, సామాజిక పరిస్థితి, వ్యక్తుల మానసిక స్థితిగతుల పట్ల ఆలోచన, మంచి అయినా, చెడు అయినా, తాను నమ్మిన దాన్ని రాజీపడకుండా

ప్రదర్శించటం రచయిత విలువనూ, అతని రచన విలువనూ పెంచుతాయి. లేని పక్షంలో ' తన పాత్రల మీద మాట పడనివ్వనని రచయిత ఎంతగా అన్నా, మాటలు పడక తప్పదు.

స్వేచ్ఛ

కర్రి శివాజీ రచించిన ఈ కథ మే 22, స్వాతి వారపత్రికలో ప్రచురితమయింది. ఈ కథే ఈ నెల కథ. మన కథకులు విస్మరిస్తున్న అత్యంత ఆవశ్యకమైన 'దేశభక్తి'ని ఈ కథ ప్రదర్శిస్తుంది. పౌరుడికి దేశం పట్ల ఉన్న బాధ్యతను నొక్కి చెపుతుందీ కథ. అందుకే, కథనం విషయంలో సన్నివేశ స్పష్టీకరణ విషయంలో ఎంత అసంతృప్తి ఉన్నా, 'కథాంశం' ఈ కథను ఈనెల కథగా నిలుపుతుంది.

కాశ్మీరులో పూంచ్ సెక్టర్‌లో, లైన్ ఆఫ్ కంట్రోల్ దగ్గర ఉన్న డిఫెన్స్ పోస్ట్‌లో పనిచేస్తుంటాడు వెంకటేశ్వర్లు. విపరీతమైన మానసిక ఒత్తిడి, దుర్భరమైన వాతావరణ పరిస్థితులకు తట్టుకోలేక పోతాడు. ముఖ్యంగా, సెలవులకని ఇంటికి వెళ్ళివచ్చిన తరువాత, ఇతరులలా 'స్వేచ్ఛ'ను అనుభవించలేకపోవటం భార్యా, పిల్లలతో గడవలేక పోవటం అతడిలో తీవ్రమైన అసంతృప్తిని కలిగిస్తుంది.

'మంచుకొండల్లో తుపాకీలు తుడుచుకుంటూ గడపడం తనవల్ల కాదని' లీవుతీసుకుని వచ్చి, తిరిగి వెళ్ళడు. మిలటరీలో సంపాదించిన అనుభవంతో తండ్రి గేరేజీని బాగా నడిపి డబ్బులు సంపాదిస్తుంటాడు. అతడు సెలవుకని వెళ్ళి, డ్యూటీకి తిరిగి రాకపోవటంతో, మిలటరీవారు అతనిపై 'వారెంటు' జారీ చేస్తారు. కానీ, దాన్ని అతడికి అందివ్వకుండా, ఉండేందుకు పోలీసులు 'లంచం' అడుగుతారు. లంచం ఇస్తాడు వెంకటేశ్వర్లు. అయితే, దేశసేవ చేయాలనుకునే భర్తను కోరుకున్న అతడి భార్య, వెంకటేశ్వర్లుని వదిలి గర్భవతినని చెప్పకుండా, పుట్టింటికి వెళ్ళిపోతుంది. అతడి తల్లి నిరసనను చూసి, వెంకటేశ్వర్లు భార్యకోసం వెళతాడు. 'పుట్టబోయే బిడ్డ చెవిలో గర్వంగా చెప్పాలనుకునేదానిని నువ్వొక సైనికుడి బిడ్డవని' అంటుంది. 'బాధ్యతకి వెన్ను చూపటం పిరికితనమే' అంటుంది. దేశం బాధ్యతను, మరచిపోయి స్వేచ్ఛ కావాలనటాన్ని విమర్శిస్తుంది. 'స్వేచ్ఛ' అనేది మన కర్వ్యాన్ని నిర్వర్తించినప్పుడే లభిస్తుందంటుంది. మంచులో పనిచేసే సైనికుల సీడీ చూపి 'ఇది మీ బాధ్యత' అని గుర్తు చేస్తుంది. ఆమె మాటలకు కనువిప్పు కలిగి వెంకటేశ్వర్లు మళ్ళీ సైన్యంలోకి వెళ్ళిపోవాలని నిశ్చయించుకుంటాడు. ఈ నిర్ణయం తీసుకోవటంలో పోలీసుల లంచం వేధింపు తన వంతు పాత్ర వహిస్తుంది. నిర్ణయం తీసుకోవటంతో 'జీవితంలో మొట్టమొదటి సారిగా అతడికి ఈ ప్రపంచంలో నుండి సంపూర్ణ స్వేచ్ఛ లభించిన భావన' కలుగుతుంది. ఇదీ కథ.

నిజానికి ఇది కొత్త కథ కాదు. 'ఖడ్గతిక్కన' కథ మనకు తెలిసిందే పైగా వెంకటేశ్వర్లు తిరిగి వెళ్ళేందుకు బలమైన కారణం కథలో లేదు. కానీ, సైనిక జీవితం పట్ల సమాజంలో చిన్న చూపు ఏర్పడుతూ, యువతీ యువకులు 'ఇతర' ఉద్యోగాల వైపే మొగ్గు చూపుతున్న సమయంలో సమాజానికి బాధ్యత, కర్తవ్యాలను గుర్తుచేసే ఇలాంటి కథల అవసరం ఎంతయినా ఉంది. అందుకే, ఈ కథ ఎంత మామూలుగా ఉన్నా 'ఈనెల కథ'గా ఎంపికయింది.

మన సమాజంలో మన కథకులు విస్మరిస్తున్న అంశాలు, అత్యంత ప్రాధాన్యమైనవి అనేకం ఉన్నాయి. కానీ, మన కథలు మాత్రం స్త్రీ, పురుష సంబంధాలు, ప్రేమలు, పెళ్ళిళ్ళ చుట్టే తిరుగుతున్నాయి. అలాంటి కథల నడుమ ఇలాంటి కథ కనబడటమే ఆనందం కలిగిస్తుంది. మనం మన సైనికుల త్యాగాలను పట్టించు కోవటం లేదు. మనం ఇళ్ళల్లో హాయిగా కూర్చుని టీవీలు చూస్తూ, ప్రతి విషయం మనకే తెలిసినట్టు వ్యాఖ్యలు చేస్తూ, విమర్శలు చేస్తున్న సమయంలో సైనికులు చలిలో, మంచులో, చీకటిలో, తుఫానుల్లో ప్రాణాలు పణంగా పెట్టి ఎప్పుడొస్తుందో తెలియని శత్రుదాడి నుంచి మనల్ని రక్షించేందుకు అనుక్షణం అప్రమత్తంగా కాపలా కాస్తుంటారు. మనం సుఖంగా, భద్రంగా బ్రతుకుతూ హక్కుల గురించీ, స్వేచ్ఛ గురించీ మాట్లాడగలగటానికి, తమ స్వేచ్ఛనూ, వ్యక్తిత్వాన్నీ, ప్రాణాన్నీ,

కర్తవ్యనిర్వహణ, బాధ్యతల ముందు దిగదుడుపుగా భావించిన సైనికుల బలిదానాల వల్లనే. కానీ, మన కథలలో తీవ్రవాదుల మనస్తత్వాలూ, అమాయకులు తీవ్రవాదులుగా మారటానికి సమర్ధనలు, సైనికులపై విమర్శలు ఉంటాయి తప్ప, సైనికుల పట్ల సానుభూతి, అవగాహన కృతజ్ఞతలు కనిపించవు. అలాంటి ‘కథ‘ ఒక్కటి కనిపిస్తే రచన ఎంత మామూలుగా ఉన్నా ఆదరించి, ప్రోత్సహించాల్సి ఉంటుంది. అప్పుడు ఇతర కథకులు కూడా తమ దృష్టిని ఈవైపు సారిస్తారు. అందుకే ఈ కథను రచించిన కర్రి శివాజీకి కృతజ్ఞతలతో కూడిన అభినందనలు.

*ఈనెల కథ*

స్వేచ్ఛ - కర్రి శివాజీ

స్వాతి వారపత్రిక, మే 22, 2009 సంచిక నుంచి

వెంకటేశ్వర్లు లైట్ మిషన్ గన్‌ని బంకర్ కన్నంలోంచి బయటకి గురిపెట్టి చాలాసేపటి నుండీ నిశితంగా చూస్తున్నాడు. కాశ్మీరులో ఊంచ్ సెక్టర్, లైన్ ఆఫ్ కంట్రోల్ దగ్గర మట్టితో కట్టబడిన ఓ డిఫెన్స్ పోస్టు అది. ఎవరో నలుగురు ఆ సరిహద్దు రేఖ దగ్గర తచ్చాడుతున్నారు, కానీ ఫైరింగ్ రేంజ్‌లో రావడం లేదు. అదీకాకుండా సరిహద్దు దాటకుండా ఫైరింగ్ చెయ్యకూడదని ఆదేశాలున్నాయి.

అలా చాలా సేపటి నుండీ దాగుడుమూతలాడుతూ, అతడి సహనాన్ని మరింతగా పరీక్షిస్తున్నారు.

వెంకటేశ్వర్లు అప్పటికే చాలా అలసిపోయాడు. ఇంటికెళ్ళొచ్చి నెలరోజులే అయినా, ఆ ఆలోచనలే వెంట తరుముతున్నాయి. రెండు నెలల సెలవూ, కొత్త ఇల్లు కట్టడానికే వాడేసాడు. స్లాబ్ మాత్రమే పూర్తయ్యింది.

లీవు అయిపోవడంతో వచ్చి డ్యూటీలో జాయినైపోయాడు. తల్లీ, తండ్రి, భార్య రుక్మిణి గుర్తొస్తున్నారు. ఉన్న క్యాజువల్ లీవు ఇప్పుడే వాడేస్తే, ఇంకా ఆర్నెల్లు పడుతుంది సంవత్సరం పూర్తవడానికి. ఇంటికెళ్ళినప్పుడు స్నేహితులనీ, బంధువులనీ చూసి అసూయ కలిగింది.

అయినా వాళ్ళకి సెలవు కూడా అక్కర్లేదు. భార్యా బిడ్డలు, బంధువులూ అందరూ చుట్టూనే ఉంటారు. పండగలకి, ఫంక్షన్లకి కలుస్తుంటారు. తనేమో బోర్డర్‌లో కనిపించని శత్రువుని కనిపెట్టుకుంటూ పడున్నాడు.

డ్యూటీ రిలీవ్ కావడానికి ఇంకో గంట ఉంది. ట్రిగర్ గార్డ్‌లో వేలు దూరదని గ్లవ్స్ తీసెయ్యడంతో చలికి వేళ్ళు కొంకర్లు పోతున్నాయి. అతడిని అసహనం ముంచెత్తింది. పక్కనే స్లీపింగ్ బ్యాగ్‌లో గుర్రుపెట్టి పడుకునున్న రంగరాజుని ఏదో అత్యవసర పనున్నట్టు నిద్రలేపాడు.

"రాజా! నేను డ్యూటీ చెయ్యలేకపోతున్నానురా, కాస్త రెస్టు తీసుకుంటాను" అని చెప్పి అతడు ఖాళీ చేసిన స్లీపింగ్ బ్యాగ్‌లోకి దూరి కళ్ళుమూసుకున్నాడు. ఎంత ప్రయత్నించినా ఏమాత్రం నిద్రపట్టలేదు.

ఏ సైనికుడి అంతరంగం తెరిచి చూసినా దాదాపు ఇదే కథ, కాస్త అటూ ఇటూగా. అందరూ అనుకుంటుంటారు - వీళ్ళు తినే తిండి నుంచీ, కట్టుకునే బట్టవరకూ అన్నీ రూపాయి ఖర్చులేకుండా ఫ్రీగా దొరుకుతాయి.

గత నలభై ఏళ్ళలో కార్గిల్ తప్పించి పెద్దగా యుద్ధ ఛాయలు కూడాలేవు అసలేం పనుంటుందని. విపరీతమైన మానసిక ఒత్తిడి, దుర్భరమైన వాతావరణ పరిస్థితులు, అపరిష్కృతంగా మిగిలిపోయిన ఇంటి గొడవలు, లీవు తర్వాత వెళ్ళిపోతున్నప్పుడు కాళ్ళకి అడ్డం పడి గొడవ చేసే పిల్లలూ, తడి కళ్ళతో దీవించే తల్లితండ్రులూ, "మళ్ళీ ఎప్పుడొస్తావ్?" అని మౌనంగా ప్రశ్నించే భార్య... అనుభవిస్తే గానీ తెలీదు మనసుకు ఆ ఆర్ద్రత.

వెంకటేశ్వర్లు తండ్రికి ఓ చిన్న మోటార్ గ్యారేజ్ ఉంది. వృద్ధాప్యంలో ఒక్కడూ అది చూసుకోలేక సతమతమవుతున్నాడు. సెలవులో ఇంటికెళ్ళినప్పుడు, వెంకటేశ్వర్లు తండ్రికి సహాయపడుతుంటాడు. చిన్నప్పటినుండీ నట్లూ, బోల్టులూ, రెంచీలతో ఆడుకునేవాడు కనుకే, మిలట్రీలో చేరిన తర్వాత వెహికల్ మెకానిక్ ట్రేడ్ ఎన్నుకుని, పదేళ్ళలో అరుదైన ప్రావీణ్యం సంపాదించాడు.

పెళ్ళైన అయిదేళ్ళలో పిల్లలు కలగలేదన్న చింత తప్పిస్తే, పెద్దగా చెప్పుకోదగ్గ అలజడులు లేని జీవితం. కానీ ఈమధ్య ఇంటికెళ్ళొచ్చిన తర్వాత అతడి దృక్పథం మారిపోయింది. తనింతకాలం కోల్పోయిన స్వేచ్ఛామయ జీవితం పట్ల ఆరాటం పెరిగిపోయింది.

మర్నాడు రైఫిల్ క్లీనింగ్ పెరేడ్‌లో, వేడినీళ్ళు పోసిన రైఫిల్ బారెల్ లోంచి ఫుల్‌త్రూ లాగుతూ, పక్కనే ఉన్న రంగరాజుతో ఇలా చెప్పాడు వెంకటేశ్వర్లు.

"రాజూ రేపు లీవులో వెళుతున్నానురా"

"అదేంట్రా, మొన్ననే వచ్చావుగదా!?"

"ఈసారి పర్మినెంట్‌గా వెళ్ళిపోతున్నానురా" అన్నాడు.

రంగరాజుకి ఆ మాటలు విని, వాటిని పూర్తిగా జీర్ణం చేసుకోవడానికి చాలా సమయమే పట్టింది.

"నిన్నా మొన్న జాయిన్ అయిన కుర్రవాడయితే ఈ మాటంటే అర్థముంది. కష్టమైన ట్రైనింగ్ పూర్తిచేసి, పదేళ్ళ సర్వీసు, రెండు పోస్టింగులూ పూర్తయిన తర్వాత ఇప్పుడేమిటి ఈ ఆలోచన?" అని అన్నాడు.

"ఇంకా ఎనిమిదేళ్ళు పూర్తిచేస్తేగానీ పెన్షన్ రాదు. అంతవరకూ ఆర్మీ వదలడానికి వీల్లేదు. సంవత్సరానికి రెండు నెలలు సెలవులు ఇస్తే ఇంకో నెల క్యాజువల్ లీవు.... బయటకెళ్ళేసరికి నలభైయేళ్ళొచ్చేస్తాయి. అప్పటివరకూ ఇలా మంచుకొండల్లో ఈ తుపాకులు తుడుచుకుంటూ ఈ జీవితం గడిపెయ్యడం నావల్ల కాదు" అన్నాడు.

"వెర్రి ఆలోచనలు మానుకో, అయినా ఈ ఉద్యోగానికి ఏంట్రా మంచి జీతం, వేళకి బలమైన ఆహారం, ఫ్రీ రైల్వే వారెంట్లు, ఆఖరికి మనం వేసుకునే మేజోళ్ళు, చెడ్డీలు కూడా గవర్నమెంటే భరిస్తుంది.

బయట చూడు ఎంత నిరుద్యోగమో, మనలా చిన్న తరగతులు చదిఇన వాళ్ళకి ప్యూన్ పోస్ట్ కూడా రాదు. అయినా నీకిప్పుడు ఏంట్రా తక్కువ?" అన్నాడు.

ఒక్కసారిగా "స్వేచ్ఛ!" అని, నిర్వికారంగా స్నేహితుడి వైపు చూసి జవాబిచ్చాడు వెంకటేశ్వర్లు.

✷✷✷

"అదేమిటి, నిన్నటితో మీ లీవు అయిపోయింది కదా... పొడిగించారా?" ఆలస్యంగా లేచిన భర్తకి వేడి వేడి కాఫీ అందిస్తూ అడిగింది రుక్మిణి.

"లేదు ఇక వెళ్ళదలచుకోలేదు" ఆమె వైపు చూడకుండా చెప్పాడు. రుక్మిణి నిశ్చేష్టురాలుగా అయ్యింది.

"నా సర్వీసంతా వెహికల్ మెకానిక్ ట్రేడ్‌లో గడిచింది. బోల్డంత అనుభవముంది. నాన్న గ్యారేజ్‌ని ఇంప్రూవ్ చేసానంటే, మిలట్రీలో కంటే ఎక్కువే సంపాదించొచ్చు... నువ్వేం బెంగపడకు" భార్యకి ధైర్యం చెప్పాడు.

"నేను ఆలోచిస్తోంది మనకెలా గడుస్తుందని కాదు... ఇలా హఠాత్తుగా మానెయ్యడమేమిటా అని"

"నేను ఇంటిపట్టున ఉండడం ఇష్టం లేదా చెప్పు ... వెళ్ళిపోతాను" భర్త వితండవాదనికి జవాను చెప్పలేక వంటగదిలో ఏదో పనిఉన్నట్టుగ వెళ్ళిపోయిందామె.

"నా ఫ్రెండ్స్ అంతా చూడు ఎంత హాయిగా ఉన్నారో. పొద్దున్న పన్లోకి వెళతారు. సాయంత్రం దర్జాగా భార్యలతో స్కూటర్ల మీద షికార్లు, లేకపోతే పిల్లలతో కలిసి హాయిగా టీవీ చూస్తూ. ఎన్ని చిన్న చిన్న సరదాలకి దూరమైపోతున్నామో ఆలోచించు. ఆర్మీలో రిటైర్ అయిన తర్వాత ఈ వయస్సు మళ్ళీ వస్తుందా?... అందుకే వెళ్ళదలుచుకోలేదు. ఇక ఈ విషయం ఇంతటితో వదిలేస్తే మంచిది" స్థిరంగా భార్య రుక్మిణికి చెప్పాడు వెంకటేశ్వర్లు.

రుక్మిణి మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చింది. బి.ఎస్సీ, బి.ఇడి అయిన తర్వాత స్కూల్లో సైన్స్ టీచర్‌గా చేరింది.చదువుకి అందం తోడవడంతో చాలా మంచి సంబంధాలు వచ్చాయి. ఆ సంబంధాలు పెళ్ళిచూపుల వరకూ కూడా రానిచ్చేది కాదు.

చిన్నప్పటినుండీ 'కలాం' గురించి చదివీ ఇన్‌స్పైర్ అవడంతో, కాబోయే భర్త సైంటిస్ట్ కాకపోయినా, దేశం కోసం పాటుపడే వ్యక్తికావాలని కోరుకునేది.

వెంకటేశ్వర్లు సంబంధం వచ్చినప్పుడు 'నువ్వింత చదువుకున్నదానివి. అతడేమో కేవలం ఓ సిపాయి మాత్రమే' అని తండ్రి ఎంత మొత్తుకున్నా అతడ్నే చేసుకుంటాననే మొండి పట్టుదలతో తన పంతం నెగ్గించుకుంది.

వెంకటేశ్వర్లు ఫీల్డ్ పోస్టింగ్స్‌తో సంవత్సరంలో చాలా కాలం దూరంగా ఉన్నా, ఎప్పుడూ మొక్కవోని ధైర్యంతో, సగర్వంగా తలెత్తుకుని తిరిగేది. తోటి టీచర్లు భర్తలు ఎంత పెద్ద ఆఫీసర్లయినా, తన భర్త దేశానికి ప్రత్యక్షంగా సరిహద్దుల్లో సేవ చేస్తున్నాడని, ఆ భాగ్యం అందరికీ కలగదని బల్లగుద్ది వాదించి ఆత్మగౌరవంతో ఉండేది. వెంకటేశ్వర్లు జీతం తక్కువైనా అతడ్ని ఆరాధించేది.

వెంకటేశ్వర్లు నిర్ణయం ఆమెకి పెద్ద షాక్‌లా తగిలింది. విలువల పునాది మీద విశ్వాసం అనే ఇటుకలు పేర్చుకుంటూ నిర్మించుకున్న మేడ హఠాత్తుగా పేకముక్కల ఇల్లులా కూలిపోయింది. కొద్దో గొప్పో ఎక్కడో మిగిలి ఉన్న ఆత్మస్థైర్యం, రెండువారాల తర్వాత సుందర్రావు రాకతో పూర్తిగా హరించుకుపోయింది.

సుందర్రావు పోలీస్ హెడ్ కానిస్టేబుల్‌గా చేస్తున్నాడు. వెంకటేశ్వర్లుకి వేలు విడిచిన మేనత్త కొడుకు.

"ఏంటి బావా ఇలాంటి పని చేసేముందు వెనకా ముందూ ఆలోచించొద్దూ. మీ మిలట్రీవాళ్ళు నీ మీద అప్రిహెన్షన్ రోల్ జారీ చేశారు. మా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇలాంటి వాటిలో పండిపోయాడు. నేను నీకు బంధువని తెలుసు కాబట్టి నన్ను పంపాడు. ముసుగులో గుద్దులాట ఎందుకు... ఫస్ట్ పేమెంట్ పదివేలు ...ప్రతినెలా అయిదువేలు... నువ్వులేవని జవాబు పంపిస్తుండాలి కదా" అన్నాడు.

రుక్మిణి ఊపిరి బిగబట్టి చూసింది. ఇంత దారుణమైన బ్లాక్ మెయిల్‌ని భర్త చాలా ఆవేశంగా తిప్పికొడతాడని.

వెంకటేశ్వర్లు లోపలికి వెళ్ళి డబ్బు తీసుకొచ్చి సుందర్రావు చేతిలో పెడుతున్నప్పుడు, ఎక్కడో అంతరాళంలో గాలికి కొట్టుకుంటూ మినుకు మినుకుమంటున్న ఓ చిన్న దీపం ఈ సంఘటనతో టప్పున ఆరిపోయింది.

ఈ సంఘటన జరిగిన కొద్దిరోజుల తర్వాత ఒంట్లో నలతగా ఉందని పుట్టింటికి బయల్దేరింది రుక్మిణి. ఆమె ఆత్మ సంఘర్షణ కొద్దికొద్దిగా అర్థమవుతూనే ఉంది వెంకటేశ్వర్లుకి. కొన్నాళ్ళు పోతే తనే అర్థంచేసుకుని తిరిగొస్తుందిలే అనే ధీమాతో 'మళ్ళీ ఎప్పుడొస్తావ్' అని కూడా అడక్కుండా మౌనంగా ఉండిపోయాడు.

తండ్రి గ్యారేజ్‌లో వెంకటేశ్వర్లు చేరిన నెలరోజులకే ఎంతో పేరొచ్చింది. ఆర్మీ వెహికల్స్ పదేళ్ళు రిపేరు చేసి పండిపోయున్నాడు. అదీకాక మిలట్రీ నేర్పించిన నిజాయితీ కష్టపడే తత్వం జోడవడంతో, కష్టమర్లకి అతడంటే విపరీతమైన గురి, నమ్మకం ఏర్పడ్డాయి.

ఖర్చులన్నీపోనూ, మొదటినెలలో ముప్ఫైవేలు, రెండో నెలలో అంతకు రెట్టింపు వచ్చిపడ్డాయి. ఇవన్నీ కాకుండా కొత్తగా వచ్చిపడిన స్వాతంత్ర్యం అతడికి అమితంగా నచ్చింది. మనకి మనమే రాజూ, మంత్రీ. ఎవరికీ జవాబు దారు కాదు అనే భావన మరీ నచ్చింది.

రుక్మిణి దగ్గరకి ఒకసారి వెళ్ళాడు గానీ, ఆమె ముభావంగా పలకరించడంతో అహం అడ్డొచ్చి, మళ్ళీ వెళ్ళలేదు. సంవత్సరం తిరిగేసరికి, కొత్త ఇల్లు కట్టి, దానికి 'రుక్మిణీ నిలయం' అని పేరు పెట్టి, భార్యని సర్ ప్రైజ్ చేస్తే ఈ కోపమంతా మంచులా కరిగిపోయి, భర్త ప్రయోజకత్వానికి ఆమె మురిసిపోతుందని అనుకున్నాడు.

రుక్మిణి అలా అలిగి వెళ్ళిపోవడానికి కారణం తను బంగారంలాంటి ఉద్యోగం మానేసి వచ్చేసాడని, ఆర్థిక ఇబ్బందులు ఎలా తట్టుకోగలమా అని ఆలోచించలేదని, అలిగి వెళ్ళిపోయిందనే భావించాడు.

అతడికి ఇతర కారణాలు వెతికే అవసరం కనిపించలేదు. సుందర్రావు ప్రతినెలా వస్తూనే వున్నాడు. కొద్దికాలం తర్వాత అందరూ మర్చిపోతారులే. ఈ సర్కిల్ ఇన్స్పెక్టర్ ట్రాన్స్‌ఫర్ అయిపోతే ఈ జాఢ్యం కూడా సమసిపోతుందిలే అనుకున్నాడు. అతడి ఆలోచన తప్పని చాలా కొద్దిరోజుల్లోనే తెలుసుకున్నాడు వెంకటేశ్వర్లు.

ఆర్నెల్లకే వెంకటేశ్వర్లు గ్యారేజ్ ఎంతో అభివృద్ధి చెందింది. పక్కనే ఉన్న స్థలం అద్దెకి తీసుకుని షెడ్లు వేసి ఇంకో పదిమందిని నియమించుకున్నాడు. అందరూ ఎక్స్ సర్వీస్‌మెన్‌లే. కానీ అతడిని ఏదో తప్పుచేసానన్న భావన అప్పుడప్పుడు చిన్నగా కదిలిస్తూనే ఉంది. మధ్యలో రంగరాజు రెండు ఉత్తరాలు రాసాడు. వాళ్ళ యూనిట్ కాశ్మీర్ నుండి అరుణాచల్ వెళ్ళిపోతుందని తెల్పింది.

ఆరోజు అతడు ఇంటికి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. స్నానం చేసి వచ్చేసరికి తల్లి భోజనం సిద్ధం చేసింది. "రుక్మిణి దగ్గరకెళ్ళావా ఈ మధ్య...?" పొడిగా అడిగిందావిడ వెంకటేశ్వర్లు ముఖాన్ని చూస్తూ.

"ఏంటమ్మా అంత పొగరు. ఓసారి వెళితే సరిగ్గా పలకరించనూ లేదు నువ్వూ, నాన్న వెళ్ళి తీసుకురండి.... వస్తానంటే" అని తల్లికి విసురుగా సమాధానమిచ్చాడు.

"లేదురా నువ్వే వెళ్ళాలి. నీ భార్య మనింటి నుండి వెళ్ళే సమయానికే నెల తప్పింది. నీకా శుభవార్త ఆ అమ్మాయి చెప్పకుండా వెళ్ళిపోయిందంటే ఎంత బాధ పడుంటుందో నువ్వే ఆలోచించు" అంది.

వెంకటేశ్వర్లు నిర్ఘాంతపోయాడు.

"నువ్వెందుకమ్మా ఇంతకాలమూ చెప్పలేదు?" తల్లిని నిలదీశాడు వెంకటేశ్వర్లు. ఆవిడ కొడుకువైపు పరిశీలనగా చూసి, నెమ్మదిగా బదులిచ్చింది.

"ఎందుకంటే నేను కూడా రుక్మిణిలానే ఆలోచిస్తాను కాబట్టి" ఆ ఒక్క మాటలో వేనవేల అర్థాలు గోచరించాయతడికి. మర్నాడే అత్తగారింటికెళ్ళాడు.

పూర్ణగర్భంతో రుక్మిణి ఎదురొచ్చింది. ఆ సమయంలో ప్రతి స్త్రీలో గోచరించే మెరుపు కూడా ఆమె కళ్ళకింద దాచలేకపోయింది.

"ఇంత అద్భుతమైన వార్త నాతో పంచుకోకుండా దాచిపెట్టి నిన్ను నువ్వు ఎందుకు టార్చర్ చేసుకున్నావ్?" భార్య చేతిని, తన చేతిలోకి తీసుకుంటూ అడిగాడు.

ఉద్వేగం అతడి కళ్ళని తడిచేసి వదిలింది.

"ఇలాంటి వార్తని ఏస్త్రీ దాచుకోలేదు.... అందులోనూ పెళ్ళయిన అయిదేళ్ళకి మొదటి ప్రెగ్నెన్సీ... కానీ చెప్పాలనిపించలేదంటే ఎంత దారుణంగా దెబ్బతిన్నానో ఊహించండి. పుట్టబోయే బిడ్డ చెవిలో గర్వంగా చెప్పాలనుకునే దానిని 'నువ్వొక సైనికుడి బిడ్డవని'.

కానీ మీరిలా ఆర్మీ వదిలేసి ఓ పిరికివాడిలా పారిపోయారంటే..... భరించలేకపోయాను. ఇక్కడ పిరికితనం అంటే శత్రువులని చూసి పరుగెత్తడం కాదు. మన బాధ్యతకి వెన్ను చూపించడం కూడా పిరికితనమే.

దేశం మీమీదొక బాధ్యత పెట్టింది. అది మరిచిపోయి 'స్వేచ్ఛ' కావాలని మీరు దాని నుంచి దూరంగా పరిగెత్తారు, నా కడుపులో ఉన్న మన బిడ్డ స్వేచ్ఛ కావాలని, నా కడుపు చీల్చుకుని బయటకి వచ్చేద్దామని ప్రయత్నించదు. ఉపమానానికి నన్ను క్షమించండి. 'స్వేచ్ఛ' అనేది మన కర్తవ్యాన్ని నిర్వర్తించినప్పుడే లభిస్తుంది.

ఏ ఉద్యోగం లేకుండా సమాజానికి ఏ మాత్రం ఉపయోగపడకుండా, తాతలు సంపాదించిన ఆస్తితో, సినిమాలు చూసుకుంటూ, పెళ్ళాం పిల్లలతో ఖాళీగా గడిపే వ్యక్తిని చూసి 'అబ్బా ఎంత ఆనందంగా ఉన్నాడు' అనుకుంటే అది మూర్ఖత్వమే.

మీరు గ్యారేజ్‌లో, ఆర్మీకంటే ఎక్కువే సంపాదిస్తున్నారు. కానీ మీకా స్కిల్ ఎక్కడినుంచి వచ్చిందో తెలుసా, ఆర్మీలో పనిచెయ్యడంవలన. రెండురోజుల క్రితం ఓ ఇంగ్లీష్ ఛానల్‌లో వచ్చిన ప్రోగ్రాం మీకోసం రికార్డ్ చేశాను.. చూడండి" అని సీడీ ప్లేయర్ ఆన్ చేసింది రుక్మిణి.

అరుణాచల్ ప్రదేశ్ తవాంగ్ ప్రాంతంలో షూట్ చెయ్యబడిందది. చైనా ఆ ప్రాంతమ్మీద తన హక్కుని ప్రకటించిన తరువాత అక్కడికి తరలి వెళుతున్న భారత సైనిక వాహనాల కాన్వాయిలవి.

మంచులో పూర్తిగా కూరుకుపోయిన వెహికల్స్‌ని, దారిలో పాడైపోయిన ట్రక్కుల్ని, రికవరీ వ్యాన్‌తో పక్కకి తప్పిస్తున్న దృశ్యాలు... వెనుకనే ఆర్మీ ఎంత కఠినమైన అప్రిస్థితుల్లో పనిచేస్తూ ఉందో వివరిస్తున్న ఇంగ్లీష్ కామెంటరీ.

కంబాట్ యూనీఫామ్స్‌లో చలిని లెక్కచెయ్యకుండా రిపేర్లు చేస్తున్న సైనికుల మీద కెమేరా జూమ్ చేశారు.... వాళ్ళల్లో రంగరాజుని స్పష్టంగా గుర్తుపట్టాడు వెంకటేశ్వర్లు. సీడీ ప్లేయర్ ఆగిన తర్వాత రుక్మిణి మళ్ళీ కొనసాగించింది. "ఈ దృశ్యాలన్నీ మీకు చూపించటానికి, ఇది..... మీ బాధ్యత అని గుర్తుచెయ్యడానికి సిగ్గుపడటం లేదు.

ఇదే విషయం మీరు తిరిగివెళ్ళనని నిర్ణయించుకున్న రోజే ఎదిరించి చెబితే, మీరిచ్చే సంజాయిషీకి బహుశ మీ వాదనే కరెక్టేనేమో అని సమాధానపడిపోయుండేదాన్నేమో. అందుకే ఇన్నాళ్ళూ ఆగాను.

అందరూ సంసారాలు చేస్తారు, పిల్లల్ని కంటారు. ముసలివారై చనిపోతారు. కానీ ఓ సైనికుడుకి మరణం లేదంటారు. వీళ్ళందరూ చాలా గొప్పవాళ్ళు....

మీరూ వాళ్ళల్లో ఒకరని ఇన్నాళ్ళూ గర్వపడ్డాను..." చెప్పడం ఆపి, అతడి వైపు అభావంగా చూసింది.

"మీరు ఇంటికెళ్ళండి. డెలివరీ తర్వాత నేనూ వచ్చేస్తాను. మళ్ళీ మీ భార్యలా ఇంతకు ముందులా ఉండలేనేమో. కానీ మన బిడ్డకి ఓ తండ్రికావాలి కదా... మనమూ అందరిలానే బతికేద్దాం మీరనుకునే ఆనందంతో".

రుక్మిణి స్థిరంగా చెప్పిందీసారి.

వెంకటేశ్వర్లు ఇంటికొచ్చేసరికే సుందర్రావు వెంకటేశ్వర్లు కూర్చుని ఉన్నాడు. "రా బావా నీకోసమే ఎదురుచూస్తున్నాను. నీ గ్యారేజ్ బాగా పెరిగిందటగా. మొత్తానికి ఆర్మీ వదిలేసి మంచి పనిచేశావ్. ఇంత సంపాదన అక్కడొస్తుందా చెప్పు. మా పోలీస్ జీపులన్నీ రిపేర్‌కి నీ గ్యారేజ్‌కే పంపమని మా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మాతో చెప్పాడు.

నువ్వు వాటికి ఛార్జ్ చెయ్యవని తెలుసనుకో. ఇంకో చిన్న విషయం.... ఈనెల నుండీ నువ్విచ్చేది కొంచెం పెంచమని చెప్పాడు. నీ ఇష్టం ఎంతైనా సరే, బంధువుల దగ్గర ఎక్కువెలా తీసుకుంటాను చెప్పు..."

వెంకటేశ్వర్లు నెమ్మదిగా లేచి సుందర్రావుని సమీపించాడు. అతడికి ఏం జరుగుతోందో తెలిసే లోపలే సాచి పెట్టి సుందర్రావు దవడ మీద కొట్టాడు.

ఆ అదటుకి, అతడు సోఫాలోంచి తూలి పోయి కింద పడిపోయాడు. అతడ్ని కాలర్ పట్టి మీదకి లాగి, మొహంలోకి తీక్షణంగా చూస్తూ చెప్పాడు.

"ఎంతకాలం బ్లాక్‌మెయిల్ చేద్దామనుకుంటున్నార్రా మీ పోలీసులు? నేను తప్పు చేశాను నిజమే. కానీ మీరెందుకురా ఇంతలా గడ్డి తింటున్నారు. వెళ్ళి మీ సర్కిల్‌కి చెప్పు. ఇంకో అరగంటలో నేను వెళ్ళిపోతున్నానని.

మళ్ళీ నేను యూనిట్‌కి రిపోర్ట్ చేస్తే, నన్ను తప్పకుండా ఆర్మీ కోర్టు శిక్షిస్తుంది. కానీ మా వాళ్ళు నన్ను నా మనసును తప్పకుండా అర్థం చేసుకుంటారు. సెలవులో ఇంటికొచ్చిన సైనికుడికి ఎన్నో సమస్యలుంటాయి.

అందుకనే ఓవర్ స్టేయల్ ఆఫ్ లీవ్‌ని తీవ్రమైన నేరంగా పరిగణించరు వలంటీర్‌గా మళ్ళీ రీజాయిన్ అయితే.... మీ చేతుల్లో రోజూ చచ్చేకంటే ఆ శిక్ష అనుభవించి మళ్ళీ నా సైనిక జీవితాన్ని ఆరంభించడమే బెటరు.... మళ్ళీ నువ్వీ ఇంటి ఛాయలకి వచ్చావంటే ఉతికి ఆరేస్తాను" చాలా తీవ్రంగా హెచ్చరించాడు వెంకటేశ్వర్లు.

సుందర్రావు వెళ్ళిపోయిన తర్వాత, బయటకొచ్చి గట్టిగా శ్వాస తీసుకుని వదిలాడు వెంకటేశ్వర్లు. జీవితంలో మొట్టమొదటిసారిగా అతడికి ఈ ప్రపంచంలో నుండి 'సంపూర్ణ స్వేచ్ఛ' లభించిన భావన కలిగింది.

***

